

— వేదుల



**'వేయించేకాటికి ముక్కలు ఎలా తరిగితే ఏమిటో? మనిషి వేపుకుని తినేది చాలదా?' అనుకునేది తాయారు. అందుకనే తన కోపాగ్నికి కారకులలో అత్తగారికి స్థానం ఇచ్చింది... చేతిలో మజ్జిగ కవ్వం తూములోకి విసరాలనుకుంది తాయారు. 'నీ కాపాటి అదృష్టం కూడా దక్కనిస్తావా?' అన్నట్లు అన్నం వారుతున్న అత్తగారు తూముకు అడ్డంగా కూర్చుంది.**

తాయారుకి ఒళ్ళు మండిపోయింది! అప్పుడప్పుడు తాయారుకి అలాగే ఒళ్ళు మండి. . . పోతూఉంటుంది. చల్లారి పోతుంది!

తారురోడ్డు ఎండకి కరిగినట్టు, తాయారుకి ఇంట్లోవాళ్లని చూసినా, పరిస్థితులు తలుచుకున్నా. . . సహనం, ఓరిమి కరిగిపోయి అడుగున నొక్కి పట్టి దాచుకున్న కోపం లావాలా పైకి చిమ్ముకువస్తుంది.

అలా తాయారులో అగ్ని రాజడానికి దోహదకారులైన వారిలో మొదటి వ్యక్తి మొగుడు సీతారాముడు! రెండో మనిషి రెండేళ్ల క్రితం రిటైర్ అయి, 'రోజుకి ఇరవై నాలుగు గంట లుండటమేమిటి? మరొక నాలుగు గంటలు ఉంటే బాగుండును!' అనుకునేంత విశ్రాంతిగా కూర్చునే మామగారు!

ఇదివరలో పని తీరాక అయిదు నిమిషాలు వీధిగుమ్మంలో నించుని నలుగురిని చూసే ఆస్కారమేనా ఉండేది. అది కాస్తా తుడిచిపెట్టుకు పోయింది, మామగారు ఆ గది ఆక్రమించుకున్న రెండేళ్ల నించి! 'విక్రమార్కుడి సింహాసనం ఇలాగే ఉండేదేమో?' అనుకుంటుంది తాయారు, తను ఎప్పుడో చదివిన థర్డ్‌ఫారం హిస్టరీ గుర్తుకు తెచ్చుకుని.

ఇక పోతే, పక్కవాటాలో కొత్తగా చేరిన సరికొత్త జంట సుజాత, ఆ పిల్ల మొగుడుకూడా తాయారుకి కోపం తెప్పించే కోవలో వాళ్లే! పాలకోవాలాగ పెళ్లాన్ని అంతలా చూసుకోవాలా? పిల్ల కంటే మించిపోయారు, వెనక డాబామీద నించుని చక్కని సాయంత్రాలు తమ సొత్తు అన్నట్టు ఆనందం అనుభవించే బెంగాలీ వనిత గీత, ఆమె భర్త! ఎర్ర జామ పండులా ఉంటుంది ఆ అమ్మాయి. దగ్గిరనుంచి ఎలా ఉంటుందో? అదేదో తను తపస్సు చేసి సంపాదించిన వరంలా ఆతను ఆమెను చూస్తూ నించుంటాడు. సీతారాముడు తాయారుని ఎలా చూసేవాడో, అసలు చూసేవాడో లేదో గుర్తుకు రాదు తాయారుకి! బెంగాలీ జంటను చూస్తే ఆమెకు ఏదో వెర్రిబాధ!


అలాంటి చక్కని వాతావరణాలు, చల్లని సాయంత్రాల వేళలో వంటింట్లో రాత్రి వేపడానికి కూరముక్కలు నిలువుగా తరగాలో, చక్రాల్లాగ తరగాలో పురమాయిస్తూ ఉండేది అత్త మథ్రదమ్మ.

'వేయించేకాటికి ముక్కలు ఎలా తరిగితే ఏమిటో? మనిషి వేపుకుని తినేది చాలదా?' అనుకునేది తాయారు. అందుకనే తన కోపాగ్నికి కారకుల్లో అత్తగారికి మూడో వ్యక్తిగా స్థానం ఇచ్చింది! ఆ తరవాత మరుదులు... మ్యాలుసైజు సైజ్ పెళ్లీడుకొచ్చిన ఆడబడుచు జానకి! మిగతా వాళ్లంతా చిన్నచిన్న పుల్లలు! అంత లెక్కలోవాళ్లు కాదు.

* * *

"ఒరేయ్, సీతారాముడూ! జానకిని కాలేజీలో చేర్పించుదామురా? పాపం! అక్కయ్యకి చదువు సంధ్య చెప్పించలేక పోయామా? నా సంపాదనతో చాలక, వాళ్ల సంసారం నానా అవస్థగా ఉంది గదా? దీనికైనా కాలేజీచదువు పూర్తి చేయిస్తే ఆ తరవాత దాని అదృష్టం దానిది. ఏమంటావు?" అని ఆ ఉదయం మామగారు వీరవెంకటసత్యంగారు కొడుకు సీతారాముణ్ణి సాలోచనగా అడిగారు. తాయారు చెవులు దొరచేసి విన్నది, భర్త ఏం జవాబు చెబుతాడో అని.

**శకుంతల**



"అలాగే, నాన్నా! దాని మార్కులు కూడా బాగున్నాయి!" ఉత్సాహంగా చెప్పాడు భర్త.

చేతిలో మజ్జిగ కవ్వం తూములోకి విసరాలనుకున్నది తాయారు. 'నీ కాపాటి అదృష్టంకూడా దక్కనిస్తావా?' అన్నట్లు అన్నం వారుస్తున్న అత్తగారు తూముకు అడ్డంగా కూర్చుంది.

కోపాన్ని మనసులో దిగమింగుకుని, కవ్వం నెమ్మదిగా కిందపెట్టి వెన్న తీయసాగింది. కొత్త పాలలో మంచి వెన్న తీయాలని, ఆ వెన్న కాచి నెయ్యి చేసి, సంపాదించే మగరాజుకు (అప్పుడు ఆడది రాణీ కాకూడదు! ఎప్పటికీ దాసీదే!) వేయాలని సుభద్రమ్మ తాపత్రయం. "తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు" అని చెబుతూ, "మూర్ఖుల మనస్సు రంజింపరాదని" అని ఆ కవి చెప్పాడు గాని, తాయారు పడితే "కొత్త పాలలో వెన్న తీయగలేము" అని రాసేది! అందుకే భయం వేసి కాబోలు తాయారుకి ఆట్టే చదువు అబ్బకుండా భర్తృహరంతో ఫుల్‌స్టాప్ పెట్టి బామ్మ కోరిక ప్రకారం అతి బాల్యంలోనే పెళ్లి చేశారు, దాని అదృష్టానికి దాన్నే వదిలివేసినట్టు. 'ఇప్పుడుమటుకు పిల్ల జానకిని కాలేజీలో చేర్పించాలి. మామ గారు అడగటం, ఈయనగారు ఒప్పు కోటం! ఇప్పటికీ గ్రహపాట్లు పాటంగా తల ఊపట మొక్కటే బాగా తెలుసు. అక్కయ్య సంసారం అద్భుతంగా ఉందిట. తమదో?'—

అందుకే తాయారుకు ఒళ్లు మండి పోయింది!

వెన్నగిన్నె పక్కకి తోసి గబగబా పెరట్లోకి వెళ్లింది

అంట్లు తోమే రంగి బర్మాముడి చుట్టుకుని, దానిచుట్టూ నక్షత్రం చామంతి కొమ్మల్ని ఆర్చీల్లాగ దోపింది భలే హుషారుగా ఉతుకుతూంది బట్టలు. ఆ బట్టలు సుజాతవి!

ఒక క్షణం దానివైపు చూస్తూ నిల్చుంది తాయారు.

గతంలో తాను పారవేసుకున్నవేవో దాని సంతోషపు పొంగులో కనిపించాయి కాందోషం పట్టిన తన అతి చిన్న సరదాలు, కోరికలు గుర్తుకి వస్తున్నట్టు అనిపించాయి అలా గుర్తు చేసుకోడానికి తాయారు ఇష్టపడటం మానేసి చాలా కాలమైనది! అందుకే చటుక్కున వెనక్కి తిరిగి సందులోకి మళ్లింది

అది సుజాత వాళ్ల వాటా.

తాను సాయంత్రం వెళ్లవలసిన సినిమా ప్రోగ్రామ్ గురించి చెబుతున్నాడు భార్యకి అతగాడు. మధ్య మధ్య నవ్వులు, ఆవిడ సిగ్గులు, మరేవో అలకలు, ఆయనగారి ఓదార్పులు, ప్రతిమాలటం. . . ఎందుకో?

తాయారు ఆగిపోయింది.

'సుజాతకి ఎంత వయస్సు ఉంటుందో? ఆవిడ్ని పిలిచి అడుగుదామా' అనుకుంది. 'అడిగితే... తన కింకా ఇరవై దాటలే దంటుంది. అంటే సరిగ్గా ముప్పై సంవత్సరాలన్న మాట! ఈ నాటి లెక్కలు అంతేగా? తను చిన్నప్పుడు లెక్కలు బాగా చేయునని తిట్టేది సంతులమ్మ కాని ఇప్పటి లెక్కల ప్రకారం తన లెక్కల్లో తప్పు! ఇప్పుడు తనకూడా జానకితోపాటు చదువుకుంటే?. . . "నీ కేం మతి పోయిందా?" అంటాడేమో తన భర్త. మతి పోకుండా ఉండాలనే అని చెప్పవచ్చు. అయినా తనకి నిజంగానే మతి పోయిందేమో. . . ఎందుకంటే తను కాపురానికి

పెట్టింది.

"అయితే మటుకు తొందరగా అడిగి వచ్చేయాలి. . ."

జానకి నవ్వి, "ఏమిటమ్మా నీ పిచ్చి? ఎలా సిలవుతుంది?" అన్నది.

"ఎందుకవదే? నీకు తోచవద్దూ?" ఏ కారణాలైనా టైములోపలే జరగాలి గాని, టైము మించి కాకూడదన్నంత నిక్కచ్చిగా పలుకుతున్న తల్లిని విముగ్గా చూసింది.

"అబ్బబ్బ, ఏమిటమ్మా? నీకు తెలియదు, ఊరుకో!" అన్నది కొంచెం గట్టిగానే.

"ఏమిటే నాకు తెలియదం. . ." అంటూ మొదలెట్టబోయిన మళ్ళద్రమ్మని సత్యంగారు కేకవేశారు.

"ఒసేయ్! ఒక రూలు అంటూ ఏడవదుటే కాలేజీకి. ముప్పూరుకో!" అంటూ, "వెళ్ళమ్మా, జానకీ, లోపలికి" అన్నారు.

ఈ లోపులో సైకిల్ దిగి, రెండో కొడుకు లోపలికి వస్తూ జానకిని చూడకుండానే, "అమ్మా!, అక్క కాలేజీలో లేదమ్మా. అక్కడ అంతా చూసి వచ్చాను" అన్నాడు.

జానకి చర్రున లేచింది. "ఛీ! ఏమిటమ్మా ఇది? నా మీద అంత నమ్మకం లేదా? నీ కూతురిని నువ్వే నమ్మలేకపోతున్నావా? కాలేజీకి వాణ్ణి పంపించి అలా తీస్తావా?. . ."

జానకికి మళ్ళద్రమ్మ ఏం సమాధానం చెబుతుందో తాయారు వినలేదు గాని, జానకి మాటల్ని వింతగా ఆలకించింది.

'ఈ జానకికి తను కాపరానికి వచ్చాక అక్షరాభ్యాసం చేశారు. తన కళ్ళముందు పెరిగిన జానకి ఎంత ఎదిగిపోయింది? ఏదీ తన కాపాటి వ్యక్తిత్వం?'

ఆ తరవాత జానకి అలవ్యంగా వస్తూనే ఉంది. మళ్ళద్రమ్మ మటుకు గొడవ చేయటం మానేసింది!

* * *

'సుజాతకి ఒంట్లో బాగా లేదట! ఏమిటో జబ్బు? వాళ్ళకి కూడా రోగాలు, జబ్బులు వస్తాయి గాబోలు!' అను కున్నది పెరట్లో పనిచేస్తున్న తాయారు.

'జబ్బు చేసినప్పుడు ఎలా ఉంటారో చూదా'మనుకున్నది!

ఆ సమయానికి డాబామీద గీత, భర్త సరాగాలు ఆడుకుంటున్నారు. ఏరెండలో గీత నెత్తుం రెంగులు మెరుస్తున్నాయి. ఆమెను మురిపెంగా చూస్తూ అతనేమిటో అంటున్నాడు. ఆమె సిగ్గుపడినట్టు పక్కకి జరిగింది. అతను పట్టుకోబోతే పరిగెత్తింది. డాబా అంతా కింకిల, సందడి. . . ఆ చప్పుళ్ళ గాలిలో తేలి వస్తున్నాయి. ఒక క్షణం వాళ్ళని అలా చూసి బరువుగా కదిలింది తాయారు.

'సుజాతని చూద్దాం' అనుకుని సందు లోకి తిరిగి తక్కువ ఆగిపోయింది.

"ఇదేమిటమ్మగారు? ఒక్క పండైనా తినలేదు. అయ్యగారు తెచ్చినందుకైనా తినండి." అది రంగి గొంతు. సుజాతని బ్రతిమాలుతూన్నట్టుంది.

"అబ్బా, వద్దే!" సుజాత విసుగు.

"సర్వానేదమ్మా, నే తినిపిస్తాగా?"

"ఆగదే! వాంతి అయిపోతుంది."

"మందు వేసుకోండి! అట్టాగే ఉంటది, మరి. ఇన్నేసి ఆపిల్ పండ్లు అయ్యగారు తెచ్చారా!. . . పండులాగ పుట్టాలి బాబు! ఆయనగారి ఆస!" కిలకిల నవ్వింది.

"అబ్బ, పోవే! ఇదీ గొప్పేనా?"— సుజాతకి తెలుసు, తన భర్త ఎంత గొప్పపడుతున్నాడో, తనెంత కులుకుతూందో?. . . అయినా రంగి దగ్గర సటన!

"అయ్య బాబోయ్! గొప్పకాదేటి? తొలిసారి ముద్దు, ముచ్చట! మీ అమ్మగారికి తెలిస్తే రెక్కలు కట్టుకుని వాలరా? ఏటే మరి? తాయారమ్మలా గనుకున్నారేటి?" వ్యంగ్యంగా నవ్వింది.

సుజాత శ్రుతి కలిపింది.

"అవునుగాని, రంగీ, ముసలాళ్ళయ్యేదాకా కంటూనే ఉంటారు కాబోలు! ఆయనగారు తన పిల్లల్ని తన లాగే తల్లో గుమాస్తాగా చేస్తాడు! ఇంక ఈపాటికి జాగ్రత్తపడరాదూ?"

రంగి సమాధానం చెప్పేలోగా తాయారు గిర్రున తిరిగి ఇంట్లోకి వచ్చి పడింది. ఒళ్ళంతా తేళ్ళు, జెర్రులు పాకినట్టుంది. "ముసలాళ్ళ అయ్యేదాకా" అన్న పదం మళ్ళీ మళ్ళీ అనుకుంది. తను సుజాతకంటే ఒకటో, రెండో ఏళ్ళు పెద్ద! అంతమాత్రానికే ముసలాళ్ళా!

తను జానకిలా చదువుకున్నాక పెళ్ళి చేసుకుని, ఆ తరవాత రెండేళ్ళు జాగ్రత్త పడితే. . . పెద్దపిల్లాడు ఇప్పుడు పుట్టేవాడేమో? ప్చ్! తనూ, తన బతుకూ?

ఆ రోజల్లా తాయారు మనస్సు బాగాలేదు. అన్నం సయించలేదు.

"అదేమిటే, అన్నం తినటం లేదు? సరే, బాగుంది, ఆ నలుగురి పిల్లలకి లేని నెప్పులు ఈ మాటు వచ్చాయి కాబోలు! మళ్ళీ మందులు ... ఖర్చులు ... అసలే అప్పాయి సంపాదన చాలక నానా అవస్థగా ఉంది. మళ్ళీ ఇదొక ఖర్చా!" మళ్ళద్రమ్మ గొణుక్కుంది.

తాయారుకు సుజాత కోసం ఆమె భర్త తెచ్చిన ఆపిల్‌పళ్ళు గుర్తొస్తున్నాయి. బలవంతంగా ఆ స్మృతిని పక్కకు తోసింది.



ప్రకృతి పరిశీలనం ఫోటో— భరద్వాజ (మద్రాసు-18)

ఆ రాత్రి భోజనాల సమయంలో సిరవెంకటసత్యంగారు కొడుకు సీతారాముడితో అన్నారు: "ఒరేయ్, అబ్బాయ్! పాపం, అక్కయ్య సంసారం తలుచుకుంటే దిగులు పుడుతూందిరా! ఆ పల్లెటూళ్ళో చదువు, సంధ్య లేక వాళ్ళ పెద్దాడికి బొత్తిగా అక్షరముక్క అబ్బటం లేదట. మనం ఈ పట్నంలో ఉండి, చూస్తూ ఊరుకోడం ఏం న్యాయం, చెప్పు? తీసుకువచ్చి చదివిద్దామా?"

"నిజమే, నాన్నా! రేపు ఉత్తరం రాసిపడేయ్!"— సీతారాముడి మాట పూర్తిచేస్తున్నప్పుడు మళ్ళద్రమ్మ మరి కాస్త పెరుగుబిళ్ళ వేసింది కంచంలో, "సంపాదించటానికి బలం ఉండాలనీ, బొత్తిగా చిక్కిపోతున్నావని" అంటూ.

ఆ సమయానికే తాయారుకు ఏదో కడుపులో తిప్పినట్టయింది. తప్పుకున్నా ఆగలేక వెనక్కి పడిపోయింది.

* * *

తెలివి వచ్చేసరికి మంచం చుట్టూ మనుష్యులున్న అలికిడి వినిపించింది. తాయారుకు కళ్ళు తెరవా లనిపించక మూసుకునే ఉంది.

"ఎంత ప్రమాదం తప్పింది? గర్భం పోవటం మాటలా? పెద్దప్రాణం దక్కింది అంతే చాలు." అది మళ్ళద్రమ్మ గొంతు.

"మా అదృష్టం బాగుంది. ఇంతటితో సరిపోయింది. పిల్లలు మేము, ఏమై పోదుమూ?" అది మామగారి గొంతు.

"తాయారూ, చూడు. ఈ కాఫీ తాగు. తెలివి వచ్చిందా? నన్ను, పిల్లల్ని అన్యాయం చేయకు . . ." భర్త కంఠంలో జీరకి చలించిందికాని, కన్నులు తెరవలేదు.

'నే నెక్కడికి పోతాను? మీ కందరికి న్యాయం చేయడానికే బ్రతికాను. లేకపోతే చాకిరీలు, సేవలు ఎలాగ? నా జీవితాంతం మీకు న్యాయం చేస్తూనే ఉంటాను.

'నాకు న్యాయం చేయాలనే, ఇలా కష్టపెట్టడ మెందుకనే ఆ శిశువు వెళ్ళిపోయింది . . .'

అలా అనుకుంటున్న తాయారు కనుకొలకులలో రెండు కన్నీటిచుక్కలు నిల్చాయి. ★